క్లుప్తంగా

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



బేగంపేటలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం బుధవారం మండల పరిధిలోని లేమూరు, రాచులూరు, బైరాగిగూడ, బేగంపేట గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అందరి సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ పనిచేస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వ పాలనతో ప్రజలు విసిగిపోయారని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సురేందర్, పుష్పదర్శన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎ.సత్యనారాయణ, కె.రాణాప్రతాప్‌రెడ్డి, ఎండీ.అఫ్జల్‌బేగ్, ఢిల్లీ శ్రీధర్, ఎం.హన్మంత్‌రెడ్డి, ఎండీ.సులేమాన్, సయ్యద్ అజీజ్, జగన్, కుమార్, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను ఆక్రమించకుండా వ్యాపారం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ సుజాత

హుడాకాంప్లెక్స్: వీధి వ్యాపారులు రోడ్లను ఆక్రమించకుండా వ్యాపారం చేసుకోవాలని సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుజాత సూచించారు. బుధవారం కమిషనర్ అధ్యక్షతన నిర్వహించిన టౌన్ వెండింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. వీధి వ్యాపారులు చెత్తను రోడ్లపై వేయకుండా, చెత్తబుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వీధి వ్యాపారులకు వెండింగ్ జోన్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. అనువైన ప్రదేశాలు గుర్తించి అక్కడే వ్యాపారం చేసుకునేలా చూడాలని సూచించారు. సమావేశంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ విక్రాంత్‌రెడ్డి, శానిటేషన్ డీఈ చందన, సహదేవ్, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

మేడే వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కేశంపేట: మండల కేంద్రంలో మేడే వాల్‌పోస్టర్‌ను సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. సీఐటీయూ మండల కన్వీనర్ బేరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమక్షంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బేరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల సాధనకు సీఐటీయూ నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. కార్మికులు, కర్షకులు మేడే వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామస్వామి, బాల్‌రాజు, రాజు, నర్సింహ, యాదయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన విద్యార్థుల క్షేత్రపర్యటన

చేవెళ్ల: గ్రామీణ ప్రాంతంలో రైతుల వ్యవసాయ పద్ధతులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అనుసరిస్తున్న విధానాలు తదితర వాటి గురించి తెలుసుకోవటంతో పాటు రైతులకు వ్యవసాయ సాంకేతిక పద్ధతులపై మోజర్ల హార్టికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు అవగాహన కల్పించారు. మండలంలోని పలుగుట్ట గ్రామంలో కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ మోజర్ల విద్యార్థులు బుధవారం గ్రామంలో క్షేత్రపర్యటన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వ్యవసాయ సాగు పద్ధతులపై రైతుల పంట పొలాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలో నేర్చుకున్న అంశాలపై గ్రామస్తులతో రూరల్ హార్టికల్చర్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రామ్ ప్రదర్శన నిర్వహించారు. గ్రామంలో రైతుల నుంచి నేర్చుకున్న అంశాలను ప్రదర్శించారు. రైతుల సమస్యలను వివరించారు. వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. గ్రామం పటం ఏర్పాటు చేసి చూపించారు. రైతులు పాటించాల్సిన సాంకేతికతతో అధిక దిగుబడులను ఎలా సాధించుకోవాలనే అంశాలను వివరించారు. పూల సాగులో తీసుకోవాల్సి మెళకవలను నేర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు సానియా, అఖిల, సంతోష, లావణ్య, ప్రీతి, శారద, స్వాతి, రచన, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

'పది'లో విద్యార్థుల హవా

- రాణించిన ప్రభుత్వ పాఠశాలల
- ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాలబాలికలు



ధ్రువతేజ, 538



మనోజ్, 536

మహేశ్వరం: పది ఫలితాల్లో విద్యాకుసుమాలు మెరిశాయి. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సర్కారు బడుల విద్యార్థులు రాణించారు. బుధవారం వెలువడిన పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో మహేశ్వరం మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. మొత్తం 33 మందికి 29 మంది పాసయ్యారు. ధ్రువతేజ 538, మనోజ్ కుమార్ 536 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచారని ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు.

సర్కారు బడుల సత్తా



వట్నాల మౌనిక 550



జి.సింధూజ 546



వెంపటి మాలవిక 545



ఎడ్ల తేజశ్రీ 574

కందుకూరు: పది ఫలితాల్లో సర్కారు బడులు సత్తా చాటాయి. బుధవారం వెలువడిన ఫలితాల్లో తిమ్మాపూర్ పాఠశాల విద్యార్థిని వట్నాల మౌనిక 550 మార్కులతో టాపర్‌గా నిలిచింది. మీర్‌ఖాన్‌పేట విద్యార్థిని జి.సింధూజ 546, నేదునూరు మోడల్ స్కూల్ విద్యార్థినులు వెంపటి మాలవిక 545, ఎగిరిశెట్టి వైష్ణవి 530, కొర్మి భార్గవి 526, అనేగొని జశ్వంత్ 518 మార్కులతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. కందుకూరు శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని ఎడ్ల తేజశ్రీ 574 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. నాదర్‌గుల్‌లో కొనసాగుతున్న కందుకూరుకు చెందిన సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థి పగడాల చరణ్‌చంద్ర 562 మార్కులు, బైరాగిగూడలోని మహాత్మాజ్యోతి బాపూలే గురుకులం విద్యార్థి ఆర్.సాయిభార్గవ్ 559 మార్కులు సాధించారు. ఇదిలా ఉండగా.. మండలంలో మొత్తం 11 జిల్లా పరిషత్ పాఠశాలలు, కస్తూర్బా, మోడల్, బీసీ,ఎస్సీ,ఎస్టీ గురుకులాలు, నాలుగు ప్రైవేట్ పాఠశాలల్లో కలిపి మొత్తం 911 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 803 మంది(88 శాతం) ఉత్తీర్ణత సాధించారు. తిమ్మాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల 92 శాతం ఫలితాలతో ప్రథమ స్థానంలో, కందుకూరు బాలికల పాఠశాల, నేదునూరు మోడల్ స్కూల్ 90 శాతం ఉత్తీర్ణతతో ద్వితీయ స్థానంలో నిలిచాయి.

'విశ్రా'లో వందశాతం ఉత్తీర్ణత



విద్యార్థులతో డైరెక్టర్ హరిహరనాథశర్మ, ఉపాధ్యాయులు

మీర్‌పేట: పదో తరగతి ఫలితాలలో తమ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారని విశ్రా విద్యాసంస్థల డైరెక్టర్ దోర్బల హరిహరనాథశర్మ తెలిపారు. జి.సిద్దార్థ్ ఆర్య 581, బి.జీవన్ బాలాజీ 577, ఓ.మనోహర్ 562, ఏ.మయాంక్ 562, కే.దీక్షిత్ 552, జి.భాను 548, ఎస్.సచిన్ 547, రోహన్ చవాన్ 545తో పాటు మరికొంత మంది 500పైగా మార్కులు సాధించారని తెలిపారు. గత మూడేళ్లలో రెండుసార్లు వందశాతం ఉత్తీర్ణత సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు.

మెరిసిన 'విజ్ఞాన్' విద్యార్థులు



అడెపు సుమిత్, 575



చెట్టి శశి- 563



గడవర్తి కృతిక చౌదరి- 558

బడంగ్‌పేట్: పదో తరగతి ఫలితాల్లో నాదర్‌గుల్ విజ్ఞాన్ ఇంటిగ్రేటెడ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. బుధవారం విడుదలైన వార్షిక ఫలితాల్లో 600 మార్కులకు గాను అడెపు సుమిత్–575, చెట్టి శశి–563, గడవర్తి కృతిక చౌదరి–558, గుడిదేవుని మణివర్షిత్–552లు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు.. పాఠశాల చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

బాలాపూర్ టాపర్‌గా జునీరా



జునీరా మహీవీన్

పహాడీషరీఫ్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బాలాపూర్ మండలం మామిడిపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని టాపర్‌గా నిలిచింది. పహాడీషరీఫ్ గ్రామానికి చెందిన జునీరా మహీవీన్.. ఇంగ్లిష్ మీడియంలో 567 మార్కులు సాధించి ఆదర్శంగా నిలిచింది.

సర్కారు బడిలో 73 శాతం



టి.కుసుమలత- 540

మీర్‌పేట: పదో తరగతి ఫలితాల్లో మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 73 శాతం ఉత్తీర్ణత సాధించిందని మండల విద్యాధికారి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్య తెలిపారు. 227 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 165 మంది ఉత్తీర్ణత సాధించారు. ఆంగ్ల మాధ్యమంలో టి.కుసుమలత 540, మరో 10 మంది 500లకు పైగా మార్కులు సాధించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కాలనీ వాసులు

ఉగ్రవాదులను అంతమొందించాలి

హయత్‌నగర్: అమాయకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదులను అంతమొందించాలని వర్ధనగర్ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. కశ్మీర్ ఉగ్రదాడిని ఖండిస్తూ.. బుధవారం రాత్రి స్థానికంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ముష్కరులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ఉగ్రవాదులను శిక్షించడంతో పాటు.. వారిని పెంచిపోషిస్తున్న పాకిస్తాన్‌కు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీశైలం, ఉపాధ్యక్షుడు రాజు, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నరేష్‌రెడ్డిస్వామి, నర్సింహులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న కాలనీ వాసులు

ఘనంగా మహాత్మా బసవేశ్వర జయంతి



బసవేశ్వరుడి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వీరశైవులు

ఇబ్రహీంపట్నం: మహాత్మా బసవేశ్వర జయంతి ఉత్సవాలను వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక చెరువు కట్టపై ఆయన విగ్రహం వద్ద ధ్వజారోహణం, పూజల అనంతరం పూలదండలు సమర్పించారు. అదే విధంగా శ్రీ భవాని నాగలింగేశ్వరాలయంలో బసవేశ్వరుడి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో సంఘం సెంట్రల్ కమిటీ సభ్యుడు శెట్టి శివకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పట్నంశెట్టి విశ్వనాథ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మయిని ఆనందప్ప, మిర్యాణం కిరణప్ప, కర్రె శశిధర్, సిద్దప్ప, గిరి, కర్నె అరవింద్, నగేశ్, యాదప్ప, రవి, విజయ్, కిషోర్, అమర్‌నాథ్, ధీరేశప్ప, పవన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మానవతావాది

మంచాల: సంఘసంస్కర్త, మానవతావాది మహాత్మ బసవేశ్వరుడని పలువురు నాయకులు అన్నారు. వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో బుధవారం బసవేశ్వర జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆ సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, మండల నాయకులు రమాకాంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.కె.భిక్షపతి, మండల అధ్యక్షుడు శేఖరప్ప, నాయకులు హరీశ్, రమేష్, సతీష్, కోటప్ప, పెంటప్ప, శివకుమార్, రాజు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

- రాజకీయాలకు అతీతంగా కేటాయింపు
- ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం. అర్హుల ఎంపికలో రాజకీయాలు వద్దు అని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో బుధవారం మున్సిపల్ అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని సూచించారు. 'తెలిసో తెలియకో ఎన్నికల వేళ ఏ పార్టీతోనైనా తిరగొచ్చు. దాన్ని మనసులో పెట్టుకొని నిజమైన పేదలకు అన్యాయం చేయవద్దు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు దక్కాలి' అని చెప్పారు. అందుకే విడతలుగా ఎంపిక సర్వేలను నిర్వహించామని వెల్లడించారు. ప్రభుత్వం నామినేట్ చేసిన కమిటీ సభ్యులు.. అర్హుల ఎంపికలో కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వారి అనుయాయులకే సంక్షేమ పథకాలను అంటగట్టిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ఇప్పుడు ప్రజాపాలన కొనసాగుతుందని, పేదలకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత ఇందిరమ్మ కమిటీ, కాంగ్రెస్ శ్రేణులపై ఉందన్నారు.

20 వేల ఇళ్లు

విడతల వారీగా నియోజకవర్గానికి 20 వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. తొలి విడతగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి 500 ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. మంజూరైన లబ్ధిదారుడు తప్పనిసరిగా ఇంటిని నిర్మించుకోవాలని, లేదంటే నష్టపోతారని వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ రవీంద్రసాగర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, వార్డు ఆఫీసర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీకి వినతి

వనస్థలిపురం: తమ కాలనీ అభివృద్ధికి సహకరించాలని హయత్‌నగర్ డివిజన్ పరిధి వనస్థలిపురం కమలానగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి బుధవారం ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు టీ.వీ.రావు, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, సభ్యులు మల్లికార్జున్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించండి

మంచాల: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకం కింద పని చేస్తున్న తమకు నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదని ఫీల్డ్‌అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ బాలశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీతాలు అందక ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పూర్తి సహకారం అందిస్తున్నామని తెలిపారు. అయినా ప్రభుత్వం మమ్మల్ని గుర్తించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి వేతనాలు చెల్లించాలని కోరారు.

'పవన్' వ్యాఖ్యలు అభ్యంతరకరం



సమావేశంలో మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ నేతలు

కడ్తాల్: జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్ 'దక్షిణ భారతదేశంలో ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చే కాంగ్రెస్ నేతలు ఉన్నారని' వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అభినవ్‌రెడ్డి అన్నారు. కశ్మీర్ ఉగ్రవాదుల దాడులో చనిపోయిన వారికి వారు బుధవారం మండల కేంద్రంలో నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. దేశం కోసం ఎంతో మంది పార్టీ నాయకులు ప్రాణాలర్పించారని, అలాంటి పార్టీపై అసత్య ఆరోపణలు చేయడం బాధ్యతా రహితమన్నారు. ఆయన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భానుకిరణ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్‌బాబా, మండల అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి రాజేందర్‌గౌడ్, నాయకులు ఆకాశ్‌గౌడ్, శ్రీకాంత్, సందీప్, మహేశ్, భాస్కర్, సల్మాన్ తదితరులు ఉన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి

హయత్‌నగర్: మండలం ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వ భూమిలో స్థలాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు బుధవారం హయత్‌నగర్ తహసీల్దార్ జానకికి వినతిపత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చంద్రమోహన్, కమిటీ సభ్యులు కీసరి నర్సింహ మాట్లాడుతూ.. సర్వే నెంబర్ 71లోని ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుందని, అక్కడ ఉన్న ఖాళీ స్థలంలో పట్టాలు ఇవ్వాలని గతంలో జిల్లా కలెక్టర్‌కు విన్నవించామని మరోసారి హసీల్దార్ దృష్టికి తీసుకొచ్చామన్నారు. గతంలో ఆ సర్వేనెంబర్‌లోని భూమిలో ఇళ్లు నిర్మించేందుకు యత్నించిన వారిపై పెట్టిన కేసులను విరమించుకోవాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో ఆలేటి ఎల్లయ్య, వెంకన్న, కృష్ణయ్య, గణేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ వాసవికాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో 29వ(ఏకోనత్రింషత్) ఇష్టి సహిత బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. మూడో రోజు బుధవారం దేవాలయంలో సూర్య ప్రభ వాహనసేవ, గజవాహన సేవ, చంద్రప్రభ వాహన సేవ, ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకులు లక్ష్మీ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమ సురేష్ కుమార్, ఫౌండర్ చైర్మన్ గారిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, కమిటీ సభ్యులు దాచేపల్లి శ్రీనివాసు, గారిశెట్టి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపు

వనస్థలిపురం: వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ల పరిధిలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీహెచ్ఎంసీ అధికారులు కొరడా ఝుళిపించారు. ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన రేకుల షెడ్లు, డబ్బాలను బుధవారం తొలగింపజేశారు. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న చిరువ్యాపారుల డబ్బాలను తొలగిస్తుండగా కాంగ్రెస్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అడ్డుకున్నారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు చిరువ్యాపారులు జీహెచ్ఎంసీ అధికారుల అనుమతితో డబ్బాలు వేసుకున్నారని, రూ. వేలు వెచ్చించి శాశ్వతంగా ఉండేలా ఇనుప డబ్బాలు వేసుకున్నారని నాయకులు పేర్కొన్నారు. దీంతో సిబ్బంది వాటిని తొలగించకుండానే వెళ్లిపోయారు. అయితే.. కొన్ని ఆక్రమణలనే తొలగించడంపై టౌన్ ప్లానింగ్ సిబ్బంది తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.